క్లుప్తంగా

అన్నదాన పథకానికి విరాళం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవ స్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి తణుకుకు చెందిన కొడవలి హైమావతి రూ.10,116 విరాళం అందించినట్లు ఆలయ ఈఓ బీహెచ్‌వీ రమణమూర్తి తెలిపారు. దాతకు ఆయన చేతుల మీదుగా స్వామి వారి చిత్రపటం అందజేశారు.

55వ రోజుకు చేరిన రిలే దీక్షలు

మలికిపురం: స్థానిక డిగ్రీ కళాశాల అధ్యాపకులు చేస్తున్న నిరసన కార్యక్రమం సోమవారం 55వ రోజుకు చేరుకుంది. బకాయి పడిన జీతాలను చెల్లించమంటూ నిరసన మొదలుపెట్టిన అధ్యాపకులను 50 రోజులు దీక్షల తర్వాత వారి జీతాలు చెల్లించేసి రేపటి నుంచి విధుల్లోకి రావద్దని నిరంకుశంగా చెప్పినటువంటి సెక్రటరీ కరస్పాండెంట్ వైఖరిని అధ్యాపకులు, ప్రజా సంఘాల నాయకులు తీవ్రంగా పరిగణించారు. 20 నుంచి 30 ఏళ్ల అనుభవజ్ఞులైనటువంటి అధ్యాపకులు వారి బోధనలు కళాశాలకు ఎంతో ముఖ్యమైన విషయం అయినప్పటికీ వారిని విధుల్లోంచి తొలగిస్తున్నాను అంటూ నిరంకుశంగా ప్రవర్తిస్తున్నటువంటి సెక్రటరీ కరస్పాండెంట్ ఇప్పటికైనా తన పంథా మార్చుకోవాలని లేకపోతే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని చెవ్వాకుల సూర్యప్రకాశరావు, గెడ్డం పేర్రాజు తదితరులు స్పష్టం చేశారు.

ఇసుక అక్రమ తవ్వకాలు సాగిస్తే ఉపేక్షించం



ఆదుర్రు పంచాయతీలో స్థానికులతో మాట్లాడుతున్న ఎస్సై చైతన్యకుమార్

మామిడికుదురు: గోదావరి నది నుంచి గుట్టుచప్పుడు కాకుండా రాత్రి సమయంలో ఇసుక అక్రమ తవ్వకాలు సాగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ హెచ్చరించారు. ఆదుర్రు గ్రామ పంచాయతీలో సోమవారం సర్పంచ్ బళ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇసుక అక్రమ తవ్వకాలకు పాల్పడినా, రవాణా చేసినా ఉపేక్షించేది లేదన్నారు. అనుమతి లేకుండా ఇసుక తవ్వకాలు సాగిస్తున్న ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేశామన్నారు. మండలంలో ఏ గ్రామంలో అయినా ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా వంటి చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఇసుక రవాణా చేసే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

రేపటిలోగా ఎమ్మెల్సీ ఓట్లకు దరఖాస్తు చేసుకోండి

అంబాజీపేట: తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి పట్టభద్రుల ఓటు హక్కు కోసం ఈ నెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ జె.వెంకటేశ్వరి అన్నారు. 2021 నవంబరు ఒకటో తేదీ నాటికి డిగ్రీ పూర్తి చేసినా, వారి సాధారణ నివాసం ఎక్కడ ఉంటే అక్కడ తహసీల్దార్, ఎంపీడీఓ, విద్యాశాఖ అధికారులకు ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓటుకు దరఖాస్తు చేసుకునే వారు తప్పనిసరిగా సర్టిఫికెట్ల నకళ్లపై గెజిటెడ్ సంతకం ఉండాలన్నారు. ఈ అవకాశాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలి

మలికిపురం: రాష్ట్రంలో పింఛన్లకు అర్హులైన వారందరికీ జనవరి నెల నుంచి కొత్త పింఛన్లు ఇచ్చే విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాలకృష్ణరాజు విజ్ఞప్తి చేశారు. లక్కవరంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రం అంతా సర్వే చేయించి అనర్హులను తొలగించి అర్హులైన వారితో పాటు కొత్త వారికి కూడా పింఛన్లు మంజూరు చేయాలని ఆయన కోరారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు



అంతర్వేది ఆలయంలో స్వామి చిత్రపటం అందుకుంటున్న దాత వంశీరాజు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలోని నిత్యాన్నదాన ట్రస్టుకు సోమవారం ఇరువురు దాతలు విరాళాలు అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా కాళ్లకూరుకు చెందిన దాత అడ్డాల వంశీరాజు, వెంకటస్వాతి దంపతులు రూ.25,116, తుని పట్టణానికి చెందిన దాత వెలవెల సాయిసమీర్, భవ్యమంజు దంపతులు రూ.25,000 విరాళాలు అందజేశారు. ఈ మేరకు పై మొత్తాలను దాతలు ఆలయ సూపరింటెండెంట్ పి.విజయ సారథికి ఇచ్చి, స్వామివారి చిత్రపటాలను దాతలు అందుకున్నారు. సీనియర్ అసిస్టెంట్ ఎం.సత్యకిరణ్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వాంగ సుందరంగా పార్కు

- అల్లూరి పార్కుకు నూతన సొబగులు
- సైన్ బోర్డులు, పెయింటింగ్ పనులు చేస్తున్న అధికారులు
- వైఎస్సార్ సీపీ హయాంలో ప్రారంభించిన పార్కు



పార్కును ప్రారంభించిన దృశ్యం (ఫైల్)



సుందరంగా తయారైన పార్కు

ఆత్రేయపురం: వైఎస్సార్ సీపీ హయంలో శంకుస్థాపన చేసి ప్రారంభోత్సవం జరుపుకొన్న ఆత్రేయపురం అల్లూరి పార్కు నేడు సర్వాంగ సుందరంగా తయారవుతుంది. సుమారు రూ.1.50 కోట్లతో గ్రామ నడిబొడ్డున ఉన్న చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, చిన్నారులకు క్రీడా పరికరాలతో అప్పటి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం చేసుకున్న అల్లూరి సీతారామరాజు పార్కుకు కొత్త శోభ సంతరించుకుంది. గతంలో ఈ చెరువు శిథిలావస్థకు చేరుకుని చుట్టూ పిచ్చిమొక్కలు ఉండేవి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఈ చెరువును అభివృద్ధి చేశారు. రూ.1.50 కోట్లతో సర్వాంగ సుందరంగా తయారు చేశారు. కాగా నేడు చెరువుకు చుట్టూ ఉన్న ప్రహరీకి పెయింటింగ్ పనులు చేస్తున్నారు. ఆ చెరువుపై వైఎస్సార్ సీపీ ప్రత్యేక దృష్టి సారించింది. రుడా ద్వారా నాటి ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి నిధులు తీసుకువచ్చి పార్కు నిర్మాణాన్ని పూర్తి చేయడమే కాకుండా ప్రారంభించారు. ఎన్నికల వేళ కావడంతో పూర్తి స్థాయిలో పనులు జరగక ముందే ప్రారంభోత్సవం చేశారు. దీంతో పెయింటింగ్ పనులకు నిధులు ఉన్నా సరే నాడు ఉపయోగించుకునేందుకు అవకాశం లేకుండా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. తాజాగా కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక అధికారులు నాడు మిగిలిన నిధులను ఉపయోగించి పార్కుకు లైటింగ్, వాకింగ్ ట్రాక్ ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వం పలు దఫాలుగా అధికారంలోకి వచ్చినా సరే ఆత్రేయపురంలో చేసిన అభివృద్ధి ఏమీ లేదనే చెప్పాలి. కాగా ఒక సారి శంకుస్థాపన చేసి, ప్రారంభోత్సవం చేసిన పార్కుకు నేడు అధికారులు తుది మెరుగులు దిద్దుతున్నారు. మరి కొద్దిరోజుల్లో అల్లూరి పార్కు ఆత్రేయపురం వాసులను అలరించనుంది. దాతలు ముందుకు వచ్చి తమ గ్రామంలో ఉన్న పార్కులో పలు సౌకర్యాలను కూడా విరాళంగా అందించారు. మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సైతం పార్కులో తన సొంత నిధులతో అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. తుది మెరుగులు దిద్దుకుంటున్న ఈ పార్కును చూసి స్థానికులు మాజీ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డికి జేజేలు పలుకుతున్నారు. ప్రస్తుతం వాకింగ్ ట్రాక్‌పై పలువురు స్థానికులు ఉదయం, సాయంత్రం వేళల్లో నడకను చేపట్టారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఆత్రేయపురం చెరువు కాదు కదా మండలంలో గొప్పగా చెప్పుకునే పనులు ఏమీ చేయలేదు. వైఎస్సార్ సీపీ హయాంలోనే మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి దగ్గరుండి మరీ పార్కు నిర్మాణాన్ని పర్యవేక్షించి పూర్తి చేయించారు.

చాలా సంతోషం



గతంలో ఈ చెరువు చుట్టూ పిచ్చిమొక్కలు, పాముల బెడద ఉండేది. కానీ ఎమ్మెల్యేగా జగ్గిరెడ్డి హయాంలో పార్కు నిర్మాణం చేపట్టారు. మాలాంటి వారి కోసం వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయడం వల్ల చాలా సంతోషంగా ఉంది.

– పేర్నెర్ల సుబ్బరాజు, ఆత్రేయపురం

కల నెరవేరింది



ఆత్రేయపురం నడిబొడ్డున ఉన్న చెరువును అభివృద్ధి చేసి మా గ్రామానికే కంఠాభరణంగా పార్కు నిర్మించిన జగ్గిరెడ్డికి కృతజ్ఞతలు. ఎన్నో ఏళ్ల మా కల నెరవేరింది.

– వేగేశ్న రామకృష్ణంరాజు, ఆత్రేయపురం

దుర్గామాతకు వెండి పాదుకల సమర్పణ



దుర్గాదేవి అమ్మవారికి వెండి పాదుకలు సమర్పించిన దాతలు

ఆలమూరు: మండలంలోని చెముడులంక శివారు గాంధీనగరంలో వేంచేసియున్న దుర్గాదేవి అమ్మవారికి సోమవారం వెండి పాదుకల సమర్పించారు. గ్రామానికి చెందిన జనసేన పార్టీ రాష్ట్ర ప్రోగ్రాం కోఆర్డినేటర్ చోడిశెట్టి చంద్రశేఖర్–పద్మలీల దంపతులు సుమారు రూ.50 వేలతో తయారు చేయించిన అర కిలో వెండి పాదుకలను శాస్త్రోక్తంగా అమ్మవారికి అలంకరించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఎంపీడీఓగా రాజు బాధ్యతల స్వీకరణ

ఆలమూరు: మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారిగా ఎ.రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మండల ప్రజా పరిషత్ అభివృద్ధికి గ్రామాల్లో సంపూర్ణ పారిశుధ్య కల్పనకు, అర్హులైన కూలీలందరికి ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటానని ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన రాజు హామీ ఇచ్చారు. గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమాఖ్య మండల ప్రజా పరిషత్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.

రహదారి అభివృద్ధికి అర్జీ



మండల పరిషత్ కార్యాలయంలో డీటీ భాస్కర్‌కు అర్జీ ఇస్తున్న బాలరాజు

సఖినేటిపల్లి: మండలంలోని శృంగవరప్పాడు శివారు రాజీవ్ కాలనీ సమీపంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి కొల్లాబత్తుల వెంకటేశ్వర్లు ఇంటి వరకూ ఏ విధమైన రోడ్డు లేక ఆ ప్రాంత వాసులు ఇబ్బందులు పడుతున్నారంటూ స్థానిక సామాజిక కార్యకర్త గెడ్డం బాలరాజు సోమవారం పీజీఆర్ఎస్‌లో అర్జీని అందజేశారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయంలో డీటీ సీహెచ్ భాస్కర్‌కు పై అర్జీని ఆయన ఇచ్చారు. అలాగే కేశవదాసుపాలెంలో సుమారు ఎనిమిదేళ్ల క్రితం రాజమండ్రి ఓఎన్జీసీ సంస్థ ఉప్పునీటిని మంచినీటిగా మార్చే సిస్టంకు ఏర్పాటు చేసిన మినరల్ ట్యాంకు నిరుపయోగంగా ఉందని గ్రామస్తుడు ఉండపల్లి రామకృష్ణ అర్జీని అందజేశారు. తమ గ్రామంతో పాటు అంతర్వేదికర, అంతర్వేది దేవస్థానం గ్రామాల్లో కూడా ఈ ట్యాంకులను అప్పట్లో ఏర్పాటు చేశారన్నారు. వీటిని వినియోగంలోకి తేవాలని ఆయన కోరారు.

కూటమి పాలనలో దళితులపై పెరిగిన దాడులు



మలికిపురం సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి

మలికిపురం: కూటమి పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై దాడులు తీవ్రమయ్యాయని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యరావు పేర్కొన్నారు. సోమవారం మలికిపురంలోని వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం సమావేశం జరిగింది. గొల్లపల్లి సూర్యారావు పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను పూర్తిగా విస్మరించిందని, అంతేకాక దళితులకు అందాల్సిన పథకాలను కూడా ఇవ్వడం లేదన్నారు. దీనికి తోడు బలహీన వర్గాలపై ఇష్టానుసారం దాడులు జరుగుతున్నా కారకులపై చర్యలు లేవన్నారు. సీఎం చంద్రబాబు ఆది నుంచీ దళిత ద్రోహి అన్నారు. కూటమి చర్యలను నిరసిస్తూ త్వరలోనే తీవ్రంగా ఆందోళనలు చేస్తామన్నారు. గ్రామాల్లో రోడ్లు వేయడం లేదు. డ్రైనేజీ సౌకర్యం లేదు. ప్రధానంగా దళిత ప్రాంతాల్లో పరిస్థితులు చాలా అధ్వానంగా ఉన్నాయి. అవేమీ పట్టించుకోకుండా వైఎస్సార్ సీపీకి ఓట్లు వేశారన్న కారణంగా దళితులపై దాడులు చేసి భయ భ్రాంతులకు గురిచేయడం ఎంత వరకూ సబబని ఆయన ప్రశ్నించారు. దళితులకు న్యాయంగా అందాల్సిన పథకాలను అందించాల్సిన ప్రభుత్వాలు ఇలా కక్షపూరిత చర్యలకు పాల్పడడంపై గొల్లపల్లి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి అక్రమాలపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందన్నారు. త్వరలోనే ప్రజాగ్రహం చూడక తప్పదని హెచ్చరించారు. పోరాటాలకు దళితులు ఎపుడూ సిద్ధంగా ఉంటారని, వెనుకడుగు వేయరని స్పష్టం చేశారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఈద రవిరెడ్డి, నల్లి డేవిడ్, తోట జాన్‌బాబు, నల్లి తిమోతి, తెన్నేటి కిషోర్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వన సమారాధన



పాఠశాల అభివృద్ధిపై చర్చించుకుంటున్న పూర్వ విద్యార్థులు

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలి జిల్లా పరిషత్ హైస్కూల్ 1987 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం వన సమారాధన నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన మల్లవరపు సూరిబాబు ఆధ్వర్యంలో హైస్కూల్ వద్ద కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులంతా కలుసుకుని ఆనందాలు పంచుకున్నారు. అలాగే ఆటల పోటీలు నిర్వహించుకున్నారు. హైస్కూల్ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ప్రతి సంవత్సరం కలవాలని నిర్ణయించుకున్నారు.

దివ్యాంగుల ప్రత్యేక అవసరాల గుర్తింపు

ఆలమూరు: దివ్యాంగులకు సంబంధించి ప్రత్యేక అవసరాలను గుర్తించి ఆ మేరకు సహాయ చలన పరికరాలను అందించేందుకు రావులపాలెంలో మంగళవారం నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేస్తున్న శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎ.రాజు కోరారు. ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రావులపాలెంలో బాలుర జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకూ ఈ శిబిరాన్ని నిర్వహించనున్నామన్నారు. ఈ శిబిరంలో దివ్యాంగులకు అవసరమైన పరికరాలను గుర్తించి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఇతర వివరాల కోసం సమీప గ్రామ సచివాలయాలను సంప్రదించాలని ఎంపీడీఓ రాజు పేర్కొన్నారు.

వైభవంగా లక్ష బిల్వార్చన



పెదపట్నంలంక లక్ష బిల్వార్చన పూజలో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: శివుడికి అత్యంత ప్రీతికరమైన కార్తికమాసం సోమవారం కావడంతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు భారీగా తరలివచ్చారు. శివాలయాల్లో అభిషేకాలు చేయించుకున్నారు. పెదపట్నంలంక గ్రామంలోని ఉమాసత్యలింగేశ్వరస్వామి, పెదపట్నంలోని ఉమామూలేశ్వరస్వామి ఆలయాల్లో లక్ష బిల్వార్చన వైభవంగా జరిగింది. దీనిలో భాగంగా విఘ్నేశ్వరపూజ, సత్యలింగేశ్వర, మూలేశ్వర స్వామి వార్లకు పంచామృతాలతో అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. పార్వతీదేవికి లక్ష కుంకుమార్చన జరిపించారు. లక్ష మారేడు దళాలతో అర్చన చేశారు. అనంతరం నీరాజన మంత్ర పుష్పం, సూర్యనమస్కారాలు, చండీహోమం, రుద్రహోమం, జ్యోతిర్లింగార్చన తదితర పూజలను వైభవంగా జరిపించారు. పలువురు భక్తులు లక్ష బిల్వార్చన పూజల్లో కర్తలుగా పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఆదిరాజు రఘునాథశర్మ, చేబ్రోలు సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ పూజ జరిగింది.

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకారం



ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణ స్వీకార సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

రాజోలు: స్థానిక ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ ప్రమాణస్వీకారం సోమవారం జరిగింది. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆధ్వర్యంలో అభివృద్ధి కమిటీ సభ్యులుగా మట్టపర్తి లక్ష్మి, ఉలిశెట్టి అన్నపూర్ణ, పితాని శ్రీనివాస్ ప్రమాణస్వీకారం చేశారు. ఆస్పత్రికి విచ్చేసే రోగులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు ఎమ్మెల్యే సూచించారు. సర్పంచ్ రేవు జ్యోతి, గుబ్బల శ్రీనివాస్, సూరిశెట్టి శ్రీనివాస్, మోకా పార్వతి తదితరులు పాల్గొన్నారు.

శివోహం.. శివోహం

- వైభవంగా తొలి కార్తిక సోమవారం
- భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు
- క్షేత్రాల్లో ప్రత్యేక పూజలు



మడికిలో అలంకార భూషితుడైన బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి




అంతర్వేది శివాలయంలో భక్తుల పూజలు అందుకున్న స్వామి




భక్తులతో పోటెత్తిన ర్యాలి ఉమాకమండలేశ్వర స్వామి ఆలయం

ఆత్రేయపురం: కార్తికమాసం తొలి సోమవారం శివునికి ప్రీతికరమైన రోజు కావడంతో శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్తికమాసంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనువాయితీ. మండలంలోని పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి ఉమాకమండలేశ్వర స్వామి, జగన్మోహినీ కేశవ స్వామి, ఆత్రేయపురం బాలాత్రిపుర సుందరీ రాజరాజేశ్వరస్వామి, వాడపల్లి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామిలతో పాటు మండల పరిధిలోని శివాలయాల్లో కార్తిక పూజలు, దీపాలంకరణ నిర్వహించారు. మండలంలోని ర్యాలి, వెలిచేరు గ్రామాల్లో వేంచేసిన అయ్యప్ప స్వామి ఆలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి. అయ్యప్ప మాలధారులు ఆయా ఆలయాల్లో అయ్యప్ప శరణఘోషతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ అధికారులు, నిర్వాహకులు పర్యవేక్షించారు.

అంబాజీపేట: మండలంలో ఉన్న శివాలయాల్లో కార్తికమాసం సందడి నెలకొంది. మొదటి సోమవారం కావడంతో వేకువజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాచవరంలో పార్వతీ సమేత రాజేశ్వర స్వామి, కందుల మల్లేశ్వర స్వామి ఆలయాల్లోను, పుల్లేటికుర్రు శివారు వ్యాఘ్రేశ్వరంలో కొలువుదీరిన బాలాత్రిపుర సుందరి సమేత వ్యాఘ్రేశ్వరస్వామి ఆలయంతో పాటు నందంపూడి, తొండవరం, మాచవరం, కె.పెదపూడి, మొసలపల్లి, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, చిరతపూడి, ఇసుకపూడి, ముక్కామల, ఇరుసుమండ గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో లక్ష బిల్వార్చన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



కొత్తపేట మండలం పలివెల ఉమా కొప్పేశ్వరుని దర్శనానికి బారులు తీరిన భక్తులు



మోరి శివాలయంలో ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

సఖినేటిపల్లి: హరిహరులకు ప్రీతికరమైన కార్తిక మాసంలోని మొదటి సోమవారం భక్తులతో శైవ, వైష్ణవాలయాలు రద్దీగా మారాయి. శివాలయాల్లో స్వామికి లక్ష బిల్వ పత్రాలతో పూజలు, ఏకాదశ రుద్రాభిషేకాలు, పార్వతీ దేవికి కుంకుమ పూజలు నిర్వహించారు. అలాగే వైష్ణవ ఆలయాల్లో లక్షతులసి పత్రాలతో పూజలు, స్వామికి అభిషేకాలు చేశారు. అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో వేపచెట్టు వద్ద దీపారాధనలు చేశారు. స్వామికి తులసిమాలలను భక్తులు సమర్పించుకున్నారు. అంతర్వేది నీలకంఠేశ్వరస్వామి, మోరి సీతారామలింగేశ్వర స్వామి, గుడిమూల కృతకృత్య రామలింగేశ్వరస్వామి వారి ఆలయాల్లో వేకువజామున నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. సాధారణ భక్తులతో పాటు, అయ్యప్ప మాలధారణ భక్తులు హరిహరులను దర్శించుకున్నారు. ఆలయాల్లో నందీశ్వరుని వద్ద, జమ్మిచెట్లు వద్ద, ధ్వజస్తంభాల వద్ద భక్తులు దీపారాధనలు చేశారు. వీటితో పాటు టేకిశెట్టిపాలెం, అంతర్వేదిపాలెం, అప్పనరామునిలంక, సఖినేటిపల్లి, సఖినేటిపల్లిలంక గ్రామాల్లో కూడా శివాలయాల్లో భక్తులు పూజలు చేశారు.

కొత్తపేట: పవిత్ర కార్తికం.. అందునా కైలాసనాథుడైన ఆ పరమేశ్వరునికి అత్యంత ప్రీతికరమైన సోమవారం .. అది కూడా ఈ కార్తికమాసంలో మొట్టమొదటిది కావడంతో శైవ క్షేత్రాలు భక్తజన సాగరాలే అయ్యాయి. పావన గోదావరి పాయలు.. ఆ నదీ కాలువలు.. పలు ఆలయాల పుష్కరిణులు.. ఇతర నదీ తీరాల్లో వేలాదిగా భక్తులు వేకువజామునే పుణ్యస్నానాలు ఆచరించి.. ఆ ముక్కంటిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆవుపాలు, పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, ఆవునేతి వత్తులతో దీపారాధన వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తపేట మండలం పలివెలలో పురాణ ప్రసిద్ధి చెందిన ఉమా కొప్పేశ్వరస్వామి వారి క్షేత్రానికి తెల్లవారుజాము నుంచే భక్తులు తరలివచ్చారు. ఆలయ మండపాలతో పాటు ప్రాంగణం అంతటా భక్తుల పూజలతో నిండిపోయింది. అనంతరం స్వామివారి అభిషేకాలు, దర్శనానికి భక్తులు బారులు తీరారు. అలాగే పలు గ్రామాల్లోని శివాలయాల్లో సోమవారం అత్యధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పలివెల ఉమా కొప్పేశ్వరస్వామి క్షేత్రానికి స్థానిక, స్థానికేతర ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రసాద వితరణ, అన్నప్రసాదం కార్యక్రమాలు నిర్వహించారు.

ఆలమూరు: కార్తిక శోభతో శైవ క్షేత్రాలన్నీ శివ నామస్మరణతో మార్మోగిపోయాయి. కార్తిక తొలి సోమవారం పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శివాలయాలకు భక్తులు పోటెత్తారు. పెనికేరు, ఆలమూరు, నర్సిపూడి, మడికి గ్రామాల్లో వేంచేసియున్న బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి, మూలస్థానం అగ్రహారంలోని మూలేశ్వరస్వామి, చొప్పెల్లలోని మల్లేశ్వర స్వామి, చింతలూరులోని పృథ్వీశ్వరస్వామి ఆలయాలతో పాటు వివిధ శివాలయాల్లో భక్తులు కార్తిక దీపాలను వెలిగించి ప్రత్యేక అభిషేకాలు, విశేషార్చనలు నిర్వహించారు.

పి.గన్నవరం: కార్తిక సోమవారం సందర్భంగా మండలంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచి పవిత్ర వశిష్ఠ, వైనతేయ నదీ పాయల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి కార్తిక దీపాలు వదిలారు. అనంతరం శివాలయాలకు వెళ్లి పూజలు చేసారు. పి.గన్నవరంలోని గరుడేశ్వరాలయంలో తెల్లవారుజామున రెండున్నర గంటల నుంచి అర్చక స్వామి భైరవబొట్ల సత్య వెంకట నారాయణ మూర్తి ఆధ్వర్యంలో స్వామి వారికి సామూహిక అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఊడిమూడి, బెల్లంపూడి, నరేంద్రపురం, ముంగండ, ఆర్.ఏనుగుపల్లి, మొండెపులంక, మానేపల్లి తదితర గ్రామాల్లో శివాలయాలకు వెళ్లి భక్తులు పరమేశ్వరునికి పూజలు చేశారు.